# కాంగ్రెస్ సర్కార్‌పై నిరసనల వెల్లువ

**పింఛన్లు పెంచాలని బీడీ కార్మికుల ధర్నా.. రుణమాఫీ కోసం రైతుల ఆందోళన.. తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు.. బిల్లులు చెల్లించాలని పాడిరైతుల నిరసన**

**కాంగ్రెస్** ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకూ నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. సోమవారం పలు జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం వివిధ వర్గాలవారు ఆందోళన బాటపట్టారు. సిద్దిపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పాడి రైతులు బిల్లులు చెల్లించాలని ధర్నా చేశారు. మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో పింఛన్లు, జీవనభృతి చెల్లించాలని బీడీ కార్మికులు రోడ్డెక్కారు. మహబూబ్‌నగర్ జిల్లాలో భూ సమస్యను పరిష్కరించాలని తల్లీకొడుకు, కామారెడ్డి జిల్లాలో డబ్బులు తీసుకుని భూమి పట్టా చేస్తలేరని రైతు ప్రజావాణిలో ఆత్మహత్యాయత్నం చేశారు. భువనగిరి జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు తహసీల్ ఆఫీస్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. ములుగు, సిద్దిపేట జిల్లాల్లో దళితబంధు పథకం అమలు చేయాలని లబ్ధిదారులు ఆందోళన చేశారు. ఖమ్మం జిల్లా మణుగూరులో బ్రీత్ అనలైజర్ లు సరిగా పనిచేస్తలేవని, మద్యం తాగని తమకు రీ టెస్ట్ చేయాలని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళనలు చేశారు. మన ఊరు- మనబడి పనుల బిల్లులు చెల్లించాలంటూ జగిత్యాల జిల్లా రేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోకి గొర్రెలనుతోలి నిరసన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు దీక్ష చేపట్టారు. వరంగల్ జిల్లాలో రుణమాఫీ కోసం రైతులు ఆందోళన చేపట్టా రు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు.

## • బిల్లులు రాలేదని పాఠశాలలోకి గొర్రెలను పంపి ..



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మన ఊరు-మనబడి'లో భాగంగా అభివృద్ధి పనులకు గతేడాది అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. అప్పటి విద్యాకమిటీ చైర్మన్ దండిక శంకర్ సొంత డబ్బులతో పనుల పూర్తి చేశాడు. దీనికి సంబంధించి బిల్లులు రాకపోవడంతో వృత్తిరీత్యా గొర్రెల కాపరిగా జీవనం కొనసాగిస్తున్న శంకర్ తాను పాఠశాలలో నిర్మించిన డైనింగ్‌హాల్‌లో గొర్రెలను తోలి నిరసన తెలిపారు. -మల్లాపూర్

## • బిల్లులు చెల్లించాలని పాడి రైతుల నిరసన



రెండున్నర నెలలుగా విజయ డెయిరీలో తమకు బిల్లులు చెల్లించడం లేదని నిరసిస్తూ పాడి రైతులు సిద్దిపేటలో విజయ డెయిరీ సెంటర్ నుంచి ముస్తాబాద్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తాలో 20 లీటర్ల గేదె, ఆవు పాలు పారబోసి నిరసన తెలిపారు. పాడిని నమ్ముకొని పలువురు రైతులు జీవిస్తున్నారని, బిల్లులు రాకపోవడంతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారని వాపోయారు. -సిద్దిపేట/ఉప్పునుంతల

## • దళితబంధు నిధుల కోసం..



దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ములుగు కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, కోఆర్డినేటర్ రమేశ్, సలహాదారు సంజీవ, నాయకులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పినట్టు వారంలోగా రెండో విడత దళితబంధు నిధులను విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ మనుచౌదరికి దరఖాస్తులు అందజేశారు. -సిద్దిపేట కలెక్టరేట్/ములుగురూరల్

## • డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించాలి



డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతో కలిసి అఖిలపక్షం నాయకులు భువనగిరి తహసీల్దార్ కార్యాలయం గేటుకు తాళం వేసి ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ అంజిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు కిరణ్‌కుమార్, భగత్, బబ్లు, సుభాష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. -భువనగిరి కలెక్టరేట్

## • భూ సమస్య పరిష్కరించాలని ఆత్మహత్యాయత్నం



భూ సమస్యను పరిష్కరించాలని మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో హన్వాడ మండలం చిన్నదర్పల్లి పరిధి హనుమాన్ టెంపుల్ తండాకు చెందిన తల్లీకొడుకు అమని బాయి, కెడావత్ రాములు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోబోయారు. పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కామారెడ్డి జిల్లా పెద్దగొడప్‌గల్ మండలం వడ్ల గ్రామానికి చెందిన రైతు గైని అంజయ్య తన పేరు మీద భూమి పట్టా చేయడం లేదంటూ ప్రజావాణిలో ఆత్మహత్యాయత్నం చేశాడు. -మహబూబ్‌నగర్ కలెక్టరేట్/పెద్దకొడప్‌గల్

## • సమస్యలు పరిష్కరించాలని ఒక రోజు సమ్మె..



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఒకరోజు దీక్ష చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ అధికారులకు అందజేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామపంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరుతూ వీడీసీ సభ్యులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. -అశ్వారావుపేట టౌన్/కంఠేశ్వర్

## • మాకూ రుణమాఫీ చేయండి..



వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లి పీఏసీఎస్ ఎదుట రుణమాఫీ కోసం రైతులు నిరసన వ్యక్తం చేశారు. సంఘంలో చింతలపల్లి, కృష్ణానగర్, పల్లార్‌గూడ, మొండ్రాయి, కుంటపల్లి గ్రామాల రైతులు 644 మంది సభ్యులుగా ఉన్నారు. వీరు ఎస్‌బీఐద్వారా 2017లో రుణం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ వర్తిస్తుందని ఆశగా ఎదురుచూసిన తమకు కన్నీరే మిగిలిందని అన్నదాతలు వాపోయారు. -సంగెం

## ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన

మద్యం అలవాటు లేనివాళ్లు కూడా మద్యం తాగినట్లు చూపుతున్న బ్రీత్ అనలైజర్‌ను మార్చకుండా డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయడం సరికాదంటూ ఆర్టీసీ మణుగూరు డిపో అద్దె బస్సు డ్రైవర్లు, సిబ్బంది బస్సులు నిలిపివేసి నిరసన చేపట్టారు. ఇఫ్టూ నాయకుడు మిడిదొడ్ల నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. మద్యం అలవాటులేని ఓ కార్మికుడిని సస్పెండ్ చేసిన అంశంపై పునరాలోచన చేయాలని కోరారు. ఆర్టీసీ డీఎం శ్యాంసుందర్ స్పందిస్తూ.. ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. -మణుగూరు టౌన్



## • అర్హులైన బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి



బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బాలమణి, బీడీ కార్మికులు పాల్గొన్నారు. పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా సిరికొండ తహసీల్ ఆఫీస్ ఎదుట బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. -మెదక్/సిరికొండ

## • మంచినీళ్ల కోసం ఖాళీ బిందెలతో నిరసన



సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని 4వ వార్డులో కొన్ని రోజులుగా తాగునీరు రావడం లేదని మహిళలు తహసీల్దార్ కార్యాలయానికి ఖాళీ బిందెలతో వచ్చి నిరసన తెలిపారు. పైప్‌లైన్ల మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కాటమయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామస్వామి, మహిళలు పాల్గొన్నారు. -తుంగతుర్తి



పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా వేంసూరు తహసీల్దార్ ఎంఏ రాజు కాళ్లు మొక్కుతున్న ఒంటరి మహిళ లోకా నాగమణి

## సారూ.. నా భూమికి పాస్‌బుక్ ఇప్పించండి

వేంసూరు, ఆగస్టు 12: 'సారూ.. నా సాగు భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించండి' అంటూ తహసీల్దార్ కాళ్లు మొక్కి వేడుకుంది ఓ ఒంటరి మహిళ. ఈ ఘటన సోమవారం ఖమ్మం జిల్లా వేంసూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన 'ప్రజావాణి'లో చోటుచేసుకుంది. అమ్మపాలెం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ లోకా నాగమణి, తనకు తన తండ్రి గోపయ్య ఎకరం భూమిని పెద్దల సమక్షంలో సాదా కాగితంపై రాసి ఇచ్చినట్టు తెలిపింది. తన అన్న, ఆయన భార్య కలిసి భూమిని వారి పేరున చేసుకున్నారని వివరించింది. తన పేరిట పాస్‌బుక్ ఇప్పించాలని తహసీల్దార్‌ను వేడుకుంటూ కంటతడి పెట్టింది. అదే తహసీల్దార్ కార్యాలయంలో మరో మహిళ కూడా కంటతడి పెట్టుకుంది. కుంచపర్తికి చెందిన మొగిలపాడు సుశీల అదే గ్రామానికి చెందిన జమ్ముల శ్రీనివాసరావు వద్ద 19 కుంటల సాగు భూమి కొనుగోలు చేశానని, దానికి అగ్రిమెంట్లు కూడా ఉన్నాయని, కానీ తన పేరుతో పాస్‌బుక్ మంజూరు కాలేదని తెలిపింది. గత రెవెన్యూ అధికారులు తన భూమిని ధరణిలో మరొకరి పేరుతో ఎక్కించి తనకు అన్యాయం చేశారని వాపోయింది. తనకు న్యాయం చేయాలంటూ మొరపెట్టుకుంది.

## రాడార్ స్టేషన్ ఏర్పాటును విరమించాలి

- **లేకుంటే 12 లక్షల వృక్షాలకు నష్టం**
- **దామగుండం అడవిని పరిరక్షించాలి**
- **'ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్' డిమాండ్**

ఖైరతాబాద్, ఆగస్టు 12: దామగుండం అడవిని పరిరక్షించాలని, రాడార్ ప్రాజెక్టు కోసం రిజర్వ్ ఫారెస్టు భూమిని కేటాయించడాన్ని విరమించుకోవాలని 'ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్' స్వచ్ఛంద సంస్థ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆ సంస్థ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భారత్ కిసాన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డీకే చంద్రశేఖర్ యాదవ్, 'ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్' ప్రధాన కార్యదర్శి మేకల కార్తీక్ యాదవ్ మాట్లాడుతూ.. వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటు కోసం వికారాబాద్ జిల్లా పూడురు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 2,900 ఎకరాల్లో 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని చెప్పారు. దీనివల్ల 20 గ్రామాల్లోని 60 వేల మంది ప్రజల ఆరోగ్యం, జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని, పశువులకు మేత తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.



రాడార్ స్టేషన్ ఏర్పాటును విరమించుకోవాలంటూ నినాదాలు చేస్తున్న 'ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్' ప్రతినిధులు